

హామీలన్నీ అమలు చేస్తాం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో ▶



షెల్టర్ ఇవ్వలేదనే హత్య

ఆలూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ హర్యానాయక్ హత్యకేసును చేవెళ్ల పోలీసులు ఒక్క రోజులోనే ఛేదించారు. 8లో ▶



బీటీ రోడ్లకు మోక్షమెప్పుడో?

పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా గ్రామీణ రోడ్ల పరిస్థితి మారడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 9లో ▶

న్యూస్‌రీల్

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరప్ప



పరిగి: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెన్న ఈశ్వరప్పను అధిష్టానం నియమించింది. గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామానికి చెందిన ఈశ్వరప్పకు రాష్ట్ర స్థాయి పదవి దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓబీసీ కులాల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చేస్తానని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన పార్టీలో బలోపేతం చేసి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు శ్రమిస్తానని అన్నారు.

ఉన్నత స్థాయిలో స్థిరపడాలి

రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అనంతగిరి: ఇంటర్ విద్య ఎంతో కీలకమని, ఈ దశలో ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. శనివారం వికారాబాద్‌లోని వికాస్ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏ స్థాయికి వెళ్లినా తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు చెప్పిన అధ్యాపకులను మరువరాదని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన లక్ష్యం చేరాలంటే నిరంతర శ్రమ తప్పదన్నారు. ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత స్థితికి చేరాలని కోరారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దాన్ని గుర్తించి సాధన చేస్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు, స్కిట్‌లు చేసి అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు ఉమారాణి, ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్, రాములు, చిన్ని కృష్ణ, సురేష్, కృష్ణ, కళావతి, కళావతి, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఫుట్‌బోర్డు ప్రయాణం

ఆర్టీసీ బస్సులోంచి జారిపడి ప్లంబర్ దుర్మరణం



రమేశ్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్టీసీ బస్సులో నుంచి జారి పడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన నదిరి రమేశ్(36) ప్లంబర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుర్మేడు నుంచి రాకపోకలు సాగిస్తూ తుర్కయంజాల్‌తో పాటుగా నగరంలో పనులు చేసుకుని ఇంటికి వెళ్తుండేవాడు. రోజు మాదిరిగానే రాత్రి 7గంటల సమయంలో తుర్కయంజాల్‌లో దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్సులో ప్రయాణికుల రద్దీ ఉండడంతో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నాడు. బస్సు అరకిలో మీటర్ దూరం వెళ్లగానే ప్లంబర్ కాలు జారికింద పడ్డాడు. దీంతో బస్సు వెనుక చక్రాలు ఆయన మీదుగా వెళ్లడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. డ్రైవర్ అంజనేయులు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది. ఘటనా స్థలిని సీఐ రాఘవేందర్‌రెడ్డి పరిశీలించారు.

గ్రేటర్‌లో 'పీక్' డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ 'పీక్' స్థాయికి చేరుకుంది. 2023 జనవరి, ఫిబ్రవరి మాసాలతో పోలిస్తే..2024లో విద్యుత్ డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. గత ఏడాది జనవరితో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో 9.47 శాతం డిమాండ్ నమోదు కాగా, గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి డిమాండ్ 12.27 శాతం అధికంగా నమోదైంది. గత ఏడాది ఫిబ్రవరిలో గ్రేటర్ గరిష్ట డిమాండ్ 2930 మెగావాట్లు ఉండగా, ఈ నెల 23న(శుక్రవారం) ఏకంగా 3174 మెగావాట్లకు చేరింది. గతంలో సరాసరి విద్యుత్ వినియోగం 51.69 ఎంయూలు ఉండగా, తాజాగా ఇది 57.34 ఎంయూలకు చేరింది. రోజురోజుకు పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరిగింది. ఫలితంగా విద్యుత్ వినియోగం కూడా భారీగా నమోదవుతుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యుత్ డిమాండ్ పీక్‌స్థాయికి చేరుకుంటుండటంతో ఫీడర్లు ఒత్తిడికి గురవుతున్నాయి.

అడవిపై 'పోడు' గొడ్డలి!

ధారూరు అటవీ ప్రాంతంలో యథేచ్ఛగా చెట్ల నరికివేత

- పంట పొలాలుగా మారుతున్న ఫారెస్ట్ భూములు
- బీట్ ఆఫీసర్లు లేకపోవడంతో విజృంభిస్తున్న అక్రమార్కులు
- 12 పోస్టుల్లో 8 ఖాళీలు
- ఉన్న నలుగురిలో ఒకరికి డిప్యుటేషన్



సంగాయపల్లి అటవీ ప్రాంతంలో అక్రమార్కులు నరికిన చెట్లు

ధారూరు: అటవీ విస్తీర్ణం పెంచేందుకు హరితహారం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వాలు వాటి రక్షణకు అధికారులను నియమించడంలో విఫలమవుతున్నాయి. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఏపుగా పెరిగిన చెట్లను యథేచ్ఛగా నరికి అటవీ ప్రాంతాన్ని పంట పొలాలుగా మారుస్తున్నారు. జిల్లాలో ధారూరు ఫారెస్టు రేంజ్‌లో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉంది. అయితే క్షేత్రస్థాయిలో అడవులను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన బీట్ ఆఫీసర్లు మాత్రం లేరు. దీంతో అడవుల సంరక్షణ గాలిలో దీపంలా మారింది. అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికేస్తుండటంతో అటవీ విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. గత ప్రభుత్వం ఏడాది క్రితం పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో అడవులను నరికి పోడు భూముల పేరిట పట్టాలు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలో 20,247 ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉంది. గత సంవత్సరం ధారూరు మండలంలో 54 మందికి 99 ఎకరాలు, యాలాల మండలంలో 30 మందికి 42 ఎకరాల అటవీ భూమిని పోడు భూముల పేరిట పట్టాలిచ్చారు. అయితే కొంతమంది అక్రమార్కులు అటవీ ప్రాంతంలో చెట్లను నరికి చదును చేస్తున్నారు. పదేళ్లకైనా పోడు భూములకు పట్టాలు రాకుండా పోతాయా అనే దురాలోచనతో అడవులను యథేచ్ఛగా నరికేస్తున్నట్లు తెలుస్తోంది.

విధుల్లో ముగ్గురే..

ధారూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో రాస్నం, ధారూరు, రుద్రారం, దోర్నాల్ బీట్లు ఉన్నాయి. వీటికి బీట్ ఆఫీసర్లు ఉన్నారు. స్టేషన్ ధారూరు, నాగసమందర్, సంగాయపల్లి, బాణాపూర్(ఈస్ట్), బాణాపూర్(వెస్ట్), కమలాపూర్, మన్‌సాన్‌పల్లి, జుంటుపల్లి బీట్లకు అధికారులు లేరు. దీంతో అంపల్లి, గురుదోట్ల, దోర్నాల్, సంగాయపల్లి అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికి పంట పొలాలుగా మారుస్తున్నారు. ఇటీవల సంగాయపల్లి బీట్‌లో చెట్ల నరికివేత వెలుగు చూసింది. అంతకుముందు అంపలి, దోర్నాల్, గురుదోట్ల, స్టేషన్‌ధారూరు అడవుల్లో చెట్ల నరికి పంట పొలాలుగా మార్చిన సంఘటనలు వెలుగు చూశాయి. మంగళవారం ఫ్లైయింగ్ స్క్వాడ్, డీఎఫ్‌ఓ వెంకటేశ్వర్లు అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేతను పరిశీలించారు.

నాలుగేళ్లుగా రేంజ్ ఆఫీసర్ పోస్టు ఖాళీ

ధారూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా 2019 వరకు పని చేసిన వెంకటయ్యగౌడ్ డిప్యుటేషన్‌పై నగరంలోని అరణ్య భవన్‌కు వెళ్లిపోగా ఆయన స్థానంలో కొన్నాళ్లు ఎఫ్‌ఆర్‌ఓ బాలయ్య ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. ఆ తర్వాత కృష్ణ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఇన్‌చార్జులు స్థానికంగా ఉండకపోవడంతో అటవీ ప్రాంతాల పర్యవేక్షణ కొరవడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం దోర్నాల్ బీట్ ఆఫీసర్ డిప్యూటేషన్‌ను రద్దుచేసి, యుద్ధప్రాతిపదికన ఖాళీగా ఉన్న 8 మంది బీట్ ఆఫీసర్ల నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

డిప్యుటేషన్‌లో దోర్నాల్ బీట్ ఆఫీసర్

రెండేళ్ల క్రితం దోర్నాల్ ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా సిరాజుద్దీన్ బాధ్యతలు చేపట్టారు. వచ్చిన వెంటనే డిప్యుటేషన్‌పై జిల్లా అటవీశాఖ కార్యాలయానికి వెళ్లారు. అప్పటి నుంచి అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. దోర్నాల్‌కు బీట్ ఆఫీసర్ లేకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికి వేస్తున్నారు.

మళ్లీ అడవిని నరికితే పోడు పట్టాలు రద్దు చేస్తాం

డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్

పోడు పట్టాలు పొందిన వారు ఆ భూమిని మాత్రమే సాగు చేసుకోవాలని, అలా కాదని మళ్లీ అడవిని నరికితే పోడు పట్టాలను రద్దు చేసి ఇచ్చిన భూమిని కూడా అటవీ ప్రాంతంలో కలుపుతామని జిల్లా ఫారెస్టు ఆఫీసర్ జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. శనివారం ఆయన ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌ఓ కృష్ణతో కలిసి ధారూరు ఫారెస్టు రేంజ్ కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడారు. అటవీ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదన్నారు. పోడు పట్టాల కోసం చెట్ల నరికివేత ఎక్కువైందన్నారు. చెట్లను నరికి పంటలు సాగు చేస్తే ఎప్పుడైనా పట్టాలు పొందవచ్చని చాలా మంది భావిస్తున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. శాటిలైట్ ఇమేజెస్ ద్వారా ఆక్రమణలు తెలుస్తాయని తెలిపారు. అడవిలో చెట్లను నరికి పంటలు సాగు చేసిన ప్రాంతాన్ని గుర్తించి అక్కడ మొక్కలు నాటుతామని తెలిపారు. డిసెంబర్ 13, 2005 వరకు కబ్జాలో ఉన్న వాటికే పోడు పట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు. పదేళ్ల కాలంలో పది హెక్టార్ల భూమి కబ్జాకు గురైందని, దాన్ని స్వాధీనం చేసుకొని 33 వేల మొక్కలు నాటినట్లు వివరించారు. సంగాయపల్లి బీట్ పరిధిలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అడవుల రక్షణపై అవగాహన కల్పిస్తామన్నారు. సంగాయపల్లి, దోర్నాల్ బీట్‌లో చెట్ల నరికివేత జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దోర్నాల్ బీట్ ఆఫీసర్ సిరాజుద్దీన్ డిప్యూటేషన్‌ను రద్దు ఇక్కడే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలోకి ట్రాక్టర్లు వెళితే సీజ్ చేస్తామని, అటవీ ఉత్పత్తులను అక్రమంగా తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.



ఇటీవల కోస్గి పట్టణంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆశలు.. అడియాసలే!

- జిల్లా వాసులను నిరాశ పరిచిన సీఎం మొదటి పర్యటన
- కొడంగల్ పరిధి దాటని అభివృద్ధి మంత్రం
- సొంత నియోజకవర్గానికే నిధుల వరద
- మిగతా ప్రాంతాల ఊసెత్తని రేవంత్

వికారాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా మొదటి పర్యటన ప్రజలను నిరాశకు గురిచేసింది. ముఖ్యమంత్రి సొంత జిల్లా వికారాబాద్‌ను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారని అందరూ భావించారు. వారి ఆశలు అడియాశలయ్యాయి. అభివృద్ధి జిల్లా మొత్తానికి ఉంటుందనుకుంటే కేవలం కొడంగల్ నియోజకవర్గానికే పరిమితం చేశారు. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్ మొదటి సారి జిల్లా పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కొడంగల్ తోపాటు పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలకు వరాల జల్లు కురిపిస్తారని భావించారు. అయితే అభివృద్ధి మొత్తం కొడంగల్ ప్రాంతానికే పరిమితం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రూ. 4,369 కోట్లు మంజూరు చేశారు. ఇందులో ప్రధానంగా రూ. 2,949 కోట్లతో ఎత్తిపోతల పథకానికి పచ్చ జెండా ఊపారు. వీటితో పాటు పంచాయతీ రాజ్ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లకు వందల కోట్లు విడుదల చేశారు. అయితే జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు కూడా భారీగా నిధులు మంజూరవుతాయని ఆయా ప్రాంతాల ప్రజలు భావించారు. కానీ అలాంటి ప్రస్తావనే సీఎం నోట రాకపోవడంతో జిల్లా వాసులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.

ఎమ్మెల్యేల వైఫల్యం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. రేవంత్‌రెడ్డి సీఎంగా కాగా, ప్రసాద్‌కుమార్‌కు స్పీకర్ బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు సీఎంకు అత్యంత సన్నిహితులే. ఇలాంటి నేపథ్యంలో వారి వారి నియోజకవర్గాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరవుతాయని భావించారు. అయితే సీఎం పర్యటనలో మిగతా నియోజకవర్గాల ఊసే వినిపించలేదు. ఇది ప్రజలను విస్మయానికి గురిచేసింది. జిల్లా ఎమ్మెల్యేలు తమతమ నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించుకునే విషయంలో విఫలమయ్యారనే వాదన వినిపిస్తోంది. గత ప్రభుత్వాల్లో సీఎంలుగా, ఇతర కీలక శాఖల్లో ఉన్న వ్యక్తులు తమ జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపించడంలో సక్సెస్ అయిన విషయం అందరికీ తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా నాయకులు సీఎంను ఒప్పించి కొడంగల్ తరహాలో మిగిలిన నియోజకవర్గాలకు నిధులు మంజూరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మోహన్ నాయక్



మహేశ్వరం: ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేశ్వరం మండలం పెద్దమ్మ తండాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కాట్రావత్ మోహన్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి గిరిజన తండా, ఆదివాసీ గూడాలను పర్యటించి.. పార్టీ సిద్ధాంతాలను తెలియజేసి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు.



వికారాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆగిన అల్పాహారం

- ఈ ఏడాది మంజూరు కాని నిధులు
- మరో 23 రోజుల్లో పదో తరగతి పరీక్షలు
- ఖాళీ కడుపుతోనే ప్రత్యేక తరగతులకు..
- ఇబ్బందుల్లో విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు మార్చి 18నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల తేదీలు ఖరారు కావడంతో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులపై దృష్టి సారించారు. గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో వికారాబాద్ జిల్లా చిట్టచివరి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. మరోసారి అలాంటి ఫలితాలు పునరావృతం కారాదనే ఉద్దేశంతో విద్యాశాఖ అధికారులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం ఇస్తారు. ఇందు కోసం ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తోంది. అయితే ఈ సారి నిధులు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఒక్కో విద్యార్థికి రూ. 15 చొప్పున ఖర్చు చేసేవారు. ఈ సారి రూ. 5 మాత్రమే కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై ఇంకా విద్యాశాఖ అధికారులకు కూడా స్పష్టత లేదు. రూ. 5తో అల్పాహారం ఎలా అందించాలని ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు ఆర్థిక సహాయంతో అల్పాహారం అందించారు.

8,500 మందికి ప్రత్యేక తరగతులు

జిల్లాలో 178 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా సుమారు 8,500 మందికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జనవరి ఒకటి నుంచి యాక్షన్ ప్లాన్ అమలు చేస్తూ విరిజన్ టెస్టులు(ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు) స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది విద్యార్థులు ఉదయం వేళ టిఫిన్ చేయకుండా తరగతులకు హాజరవుతున్నారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. దీంతో వారిలో అలసట, నీరసం కారణంగా చదువుపై దృష్టి సారించలేక పోతున్నారు. విద్యార్థుల ఆకలిని గుర్తించిన ప్రభుత్వం అల్పాహారం అందించాలని నిర్ణయించడం ఊరట కలిగించే అంశమే. కానీ ఒక్కో విద్యార్థికి ఇచ్చే 15 రూపాయలను రూ. 5 కుదించడం సరికాదని పలువురు అంటున్నారు.

గత ఏడాది 42 లక్షలు మంజూరు

జిల్లాలోని 19 మండలాల్లో 183 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 8,291 మంది 10వ తరగతి పరీక్షలకు సిద్ధమయ్యారు. వంద శాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అందుకు గాను ఒక్కో విద్యార్థికి అల్పాహారం కోసం రోజుకు రూ. 15చొప్పున నిధులు కేటాయించారు. ఈ లెక్కన రూ. 42,28,410 విడుదల చేశారు. ఈ సారి నిధులు మంజూరు కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చేవెళ్ల సభకు వడివడిగా ఏర్పాట్లు

- ఈనెల 27న మరో రెండు గ్యారంటీ పథకాల అమలు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సైబరాబాద్ సీపీ
- వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన కలెక్టర్ శశాంక



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ శ్రీనివాస్ తదితరులు

చేవెళ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ఈనెల 27న ప్రారంభించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చేవెళ్లలో నిర్వహించే సభా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు శనివారం ఉదయం ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌ను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్‌బాబు, సీఐ లక్ష్మారెడ్డి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, వీఐపీ పార్కింగ్, హెలిప్యాడ్ స్థలం తదితర వాటిని పరిశీలించారు. సభా వేదిక పరిసరాలకు సంబంధించి మ్యాప్‌లు సిద్ధం చేసుకొని ఎక్కడెక్కడ పార్కింగ్‌లు ఏర్పాటు చేయాలనేదానిపై చర్చించారు.

అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ శంశాక సాయంత్రం విద్యుత్‌శాఖ సీఎండీ ముసరఫ్‌అలీ, రవాణశాఖ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్‌ఈ వెంకన్న, డీఈఈ శివశంకర్, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ శ్రీలత, మిషన్‌భగీరథ డీఈ రాజేశ్, ట్రాన్స్‌పోర్ట్, ఫైర్ స్టేషన్, పోలీస్‌శాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సభ నిర్వహణపై వారితో చర్చించారు. శాఖల వారీగా ఎవరికి కేటాయించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించి.. సభను విజయవంతం చేసేందుకు సహకరించాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జనం వచ్చే అవకాశం ఉంది కాబట్టి తగిన విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, బాత్‌రూమ్‌లను సిద్ధం చేయాలని సూచించారు. సభా స్థలం వద్ద భద్రతా ఏర్పాట్లపై డీసీపీ శ్రీనివాస్‌తో చర్చించారు. సమావేశంలో ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ హిమబిందు, ఏడీ స్వామి, ఏఈ నయీమొద్దీన్, ఆర్‌ఐ రాజేశ్, పవన్, ఈసీ రాజశేఖర్, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

సభా స్థలిని పరిశీలించిన ప్రభుత్వ సలహాదారు

చేవెళ్లలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి శనివారం రాత్రి పరిశీలించారు. ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌ను ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. సభా ఏర్పాట్లు, నిర్వహణకు సంబంధించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏఐసీసీ నాయకులురాలు ప్రియాంకాగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, రాష్ట్రం నలుమూలల నుంచి జనం రానున్న దృష్ట్యా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. వారి వెంట స్థానిక నాయకులు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, రఘువీరారెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకం



ఇబ్రహీంపట్నం రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని అడిషనల్ డీజీ స్వాతిలక్రా పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్ థర్డ్ బెటాలియన్‌లో ఆయుధాలు భద్రపరిచే గదితో పాటు మరికొన్ని గదులు, క్యాంటీన్‌ను శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అదనపు గదులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేసేలా చూడాలని టీఎస్‌ఎస్‌పీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ విజయ్‌కుమార్, ఐజీపీ ఎండీ రమేష్, చీఫ్ ఇంజినీర్ తులసీదాస్, థర్డ్ బెటాలియన్ కమాండెంట్ వేణుగోపాల్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు కలెక్టరేట్‌ ఎదుట ధర్నా

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలమల్లేశ్‌



మాట్లాడుతున్న బాలమల్లేశ్‌

తాండూరు టౌన్‌: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులపై ఢిల్లీలో జరిపిన కాల్పులకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26న ధర్నా చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్‌.బాలమల్లేశ్‌ అన్నారు. శనివారం పట్టణంలో సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమల్లేశ్‌ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌ శక్తులకు ధారాదత్తం చేసి కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తోందన్నారు. వ్యవసాయ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు జరపడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. రైతులు, ప్రజా సంఘాల నాయకులు, సీపీఐ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్‌, జిల్లా కార్యవర్గ సభ్యులు బషీర్‌, పీర్‌ మహ్మద్‌, వెంకటేశ్‌, మునీర్‌ అహ్మద్‌, రవీందర్‌, మహమూద్‌, శ్యాంసుందర్‌, అబ్దుల్లా, రాజు, అనంతయ్య, నసీమాబేగం పాల్గొన్నారు.

4న ఎస్పీ కార్యాలయం ముట్టడి

ప్రజా సంఘాల ఐక్య వేదిక



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పరిగి: డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని మార్చి 4న నిర్వహించ తలపెట్టిన ఎస్పీ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపున్నారు. శనివారం ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ.. తిమ్మాయిపల్లి భూ వివాదంలో జోక్యం చేసుకుని అధికార పార్టీకి కొమ్ము కాస్తూ ఖాస్తును విడిపించి పేదలకు అన్యాయం చేస్తున్న డీఎస్పీపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. సివిల్‌ కేసులో పోలీసులకు ఎలాంటి సంబంధం లేకున్నా డబ్బులు వసూళ్లకు పాల్పడుతూ పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎన్ని వినతులు ఇచ్చినా ఉన్నత అధికారులు పట్టించుకోవడం లేదని అందుకే బాధితుడికి న్యాయం చేయాలని ఎస్పీ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోవింద్‌, శ్రీనివాస్‌, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఫాంహౌస్‌పై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

15 లీటర్ల మద్యం స్వాధీనం

మొయినాబాద్‌: అనుమతి లేకుండా మద్యం సేవిస్తూ పార్టీ నిర్వహిస్తున్న ఓ ఫాంహౌస్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారం శివారులోని ఓ ఫాంహౌస్‌లో శనివారం రాత్రి అనుమతులు లేకుండా లిక్కర్‌ పార్టీ నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్‌ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఫాంహౌస్‌పై దాడి చేసి పార్టీ నిర్వహిస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హామీలన్నీ అమలు చేస్తాం

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



యాలాల: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని ఎన్కేపల్లి, అగ్గనూరు, చెన్నారం, అక్కంపల్లి, జుంటుపల్లి, యాలాల, నాగసముందర్‌, పగిడియాల, రాస్నం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల పారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్లలో పాత ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. జుంటుపల్లి ప్రాజెక్టు అభివృద్ధిని విస్మరించారన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టు అభివృద్ధికి రూ.60 కోట్ల నిధులు మంజూరు చేశబూమన్నారు. నెలాఖరులోగా మరో రెండు హామీలను అమలు చేస్తామని వివరించారు. గ్రామాల్లో అవసరమైన అన్ని మార్గాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు.

పాఠశాలల అభివృద్ధికి రూ.10లక్షల నిధులు

మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అక్కంపల్లి, జుంటుపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు లేక ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. అక్కంపల్లి పాఠశాలకు రూ.6 లక్షలు, జుంటుపల్లి పాఠశాలకు రూ.4 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌ గుప్తా, సొసైటీ చైర్మన్‌ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌ బీ–బ్లాక్‌ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌, బీసీ సెల్‌ మండల అధ్యక్షుడు అమృతప్ప, కోఆప్షన్‌ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ సర్పంచ్‌లు భీమప్ప, హన్మంతు, నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులుగౌడ్‌, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు కృత్రిమ కాళ్ల అమరిక

తాండూరు టౌన్‌: మార్వాడీ యువమంచ్‌ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మార్చి 11న ప్రారంభం కానున్న ఉచిత జైపూర్‌ కృత్రిమ కాళ్ల అమరిక శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవా తత్పరతతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మార్వాడీ యువమంచ్‌ సేవలు హర్షనీయమన్నారు. మార్చి 11, 12, 13 తేదీల్లో పట్టణంలోని బాలాజీ మందిర్‌లో జక్కేపల్లిలోని రాడికల్‌ బయో ఆర్గానిక్స్‌ లిమిటెడ్‌ (ఆర్‌బీఓఎల్‌) సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్ల అమరిక, పోలియో వ్యాధిగ్రస్తులకు కాలిపర్స్‌ అమరిక కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మంచ్‌ అధ్యక్షుడు బ్రిజ్‌మోహన్‌ బూబ్‌ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో 200 మందికి సేవలు అందించనున్నట్లు చెప్పారు. శిబిరానికి మొదట వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అంగవైకల్యం కనపడేటట్లుగా రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌ కార్డు జిరాక్స్‌తో శిబిరానికి హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్వాడీ యువమంచ్‌ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్‌ సార్డా, కుంజ్‌ బిహారి సోని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సన్ని అగర్వాల్‌, కార్యదర్శి కిషన్‌ రాఠి, కోశాధికారి అరుణ్‌సార్డా, క్యాంప్‌ చైర్మన్‌ కరన్‌ జైన్‌, కాంగ్రెస్‌ నాయకులు అబ్దుల్‌ రవూఫ్‌, బాల్‌రెడ్డి, ధారాసింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను వేగిరం చేయండి

జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి



పనులను పర్యవేక్షిస్తున్న సునీతారెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లో నిర్మిస్తున్న జిల్లా పరిషత్‌ నూతన భవన నిర్మాణ పనులను జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి పరిశీలించారు. శనివారం ఆమె జెడ్పీ కార్యాలయంలో ఇంజనీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 60శాతం పనులు పూర్తయినట్లు ఈఈ ఉమేశ్‌ చైర్‌పర్సన్‌కు వివరించారు. గ్రౌండ్‌ ఫ్లోర్‌ పనులు మరో పది రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. అంతకుముందు జెడ్పీ నూతన భవనం ప్లానింగ్‌ నమూనాను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధీర్‌, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



స్వామి వారి పల్లకీ సేవ

- కనుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం
- రథోత్సవానికి తరలిన భక్తజనం

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్‌(చంద్రగిరి)లో గోవింద నామస్మరణం మార్మోగింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి వారిరథోత్సవం సాయంత్రం అశ్వవాహన సేవ నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ కోట్రిక విజయలక్ష్మి, పట్టణ సీఐ సంతోశ్‌కుమార్‌, ఎంపీటీసీ శాంతు, మాజీ సర్పంచ్‌ రాములు, వెంకటాచార్‌ శుక్రవార్‌, రాఘవచార్‌, పురంధరాచార్‌, గుండాల సుధాకర్‌, సుబ్బారావు, పూసల రమేశ్‌, చంద్రశేఖర్‌ గౌడ్‌, నర్సింలు, శ్రీనివాస్‌, ప్రభాకర్‌రెడ్డి, అంబ్రేశ్‌, జగదీశ్‌గౌడ్‌, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ పై చర్యలు తీసుకోవాలి

ఉపాధ్యాయ సంఘాల నాయకుల డిమాండ్‌



మాట్లాడుతున్న సుదర్శన్‌, సతీశ్‌కుమార్‌

బంట్వారం: నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఎంఈఓ చంద్రప్పపై చర్యలు తీసుకోవాలని టీయూటీఎఫ్‌, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల మండల అధ్యక్షులు బంటు సుదర్శన్‌, సతీశ్‌ కుమార్‌ విద్యాశాఖ ఉన్నతాధికారులను డిమాండ్‌ చేశారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల ఎంపిక చేసిన రిసోర్స్‌పర్సన్ల విషయంలో ఎంఈఓ నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. మండల పరిధిలో సీనియర్‌ ఉపాధ్యాయులున్నప్పటికీ 2020లో నియామకమైన జూనియర్‌ ఉపాధ్యాయుడికి రిసోర్స్‌పర్సన్‌గా నియమించడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. ఎంఈఓ వ్యవహార శైలిపై ఉపాధ్యాయులు అసంతృప్తికి గురవుతున్నారన్నారు. ప్రతిరోజు ఏదో ఒక పాఠశాల ఉపాధ్యాయుడిని ఎంఈఓ తన వెంటేసుకుని తిరుగుతున్నారని.. ఈ క్రమంలో ఆ పాఠశాల విధులకు ఆటంకం కలుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలు చెబుదామన్న ఫోన్‌ లిఫ్ట్‌ చేయని పరిస్థితి ఉందన్నారు. కనీసం ఆరు మాసాలకు ఒకసారైన హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఎంఈఓ పై చర్యల నిమిత్తం కలెక్టర్‌, ఆర్‌జేడీ, డీఈఓలకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత, కొనుగోలుదారుడికి రిమాండ్‌



పోలీసులకు పట్టుబడిన యువకులు

మొయినాబాద్‌: నగరం నుంచి గంజాయి ప్యాకెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ విద్యార్థితోపాటు గంజాయి కొంటున్న యువకుడిని ఎస్‌ఓటీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిని మొయినాబాద్‌ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్‌ జిల్లా పూడూరు మండలం కంకల్‌ గ్రామానికి చెందిన సీహెచ్‌.భరత్‌ జేబీఐటీ కళాశాలలో ఇంజనీరింగ్‌ చదువుతున్నాడు. గంజాయికి అలవాటు పడిన భరత్‌ ఇటీవల సప్లయర్‌గా మారాడు. నగరం నుంచి గంజాయి తీసుకొచ్చి మండల పరిధిలో యువకులకు, కళాశాలల వద్ద విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం నగరంలోని నానక్‌రామ్‌గూడ నుంచి 200 గ్రాముల గంజాయి ప్యాకెట్లను తీసుకుని బైక్‌పై అజీజ్‌నగర్‌ చౌరస్తా వద్ద ఉన్న వీజేఐటీ కళాశాల వద్దకు వచ్చాడు. జేబీఐటీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మహారాష్ట్రలోని లాతూరుకు చెందిన షేక్‌ అలీం భరత్‌ వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. అక్కడే మాటేసిన రాజేంద్రనగర్‌ జోన్‌ ఎస్‌ఓటీ పోలీసులు ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 40 గ్రాముల చొప్పున్న ఐదు ప్యాకెట్లు, బైక్‌, సెల్‌ను స్వాధీనం చేసుకుని మొయినాబాద్‌ పోలీసులకు అప్పగించారు.

కల్వర్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



పెద్దేముల్‌ సమీపంలో కల్వర్టును ఢీకొట్టిన బస్సు

పెద్దేముల్‌: ఆర్టీసీ బస్సు కల్వర్టును ఢీకొట్టిన ఘటన శనివారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన ప్రకారం.. తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సంగారెడ్డి నుంచి తాండూరుకు 30 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తోంది. గ్రామ సమీపంలో కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వవద్ద ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి కాల్వ కల్వర్టును ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. కాగా ఈ ప్రమాదంలో ఓ చిన్నారి, మహిళ తలకు స్వల్ప గాయపడినట్లు బంధువుల ద్వారా తెలుస్తోంది. కాగా ఎస్‌ఐ గిరిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

'అవేర్‌' సేవలు అభినందనీయం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవన్‌జీ

మహేశ్వరం: పేదలకోసం అవేర్‌ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్‌ సమీపంలో భగవతిపురంలో అవేర్‌ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలన్నారు. ప్రతీ రోజు ఆరోగ్యం, యోగ్యం, ధ్యానం, వాకింగ్‌, వ్యాయామానికి కేటాయిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. అవేర్‌ మాధవన్‌జీ సంస్థ ఆధ్వర్యంలో మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్‌, కల్వకుర్తి, ఆమనగల్‌, తలకొండపల్లి మండలాల్లో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 865 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్‌ సత్యనారాయణ, అవేర్‌ సంస్థ చైర్మన్‌ మాధవన్‌జీ, సంస్థ ప్రతినిధులు రాజవర్ధన్‌రెడ్డి, మంజూర్‌ అహ్మద్‌, రమాకాంత్‌, సీతారామయ్య, వరుణ్‌, తరుణ్‌, నాగేశ్వర్‌రావు, వెంకన్న, సంజనారెడ్డి, ప్రవీణ, వైద్యులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్లు, లారీ సీజ్‌



పోలీసుల అదుపులో డ్రైవర్‌, సీజ్‌ చేసిన లారీ

యాలాల: అనుమతులు లేకుండా కాగ్నా నది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను యాలాల పోలీసులు సీజ్‌ చేశారు. ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్‌ కాగ్నా నది నుంచి కమాల్‌పూర్‌ వైపు రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ట్రాక్టర్లను సీజ్‌ చేసి పీఎస్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కలప తరలిస్తున్న లారీ సీజ్‌

ధారూరు: కలపను అక్రమంగా తరలిస్తున్న లారీని శనివారం పోలీసులు సీజ్‌ చేశారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని కోట్‌పల్లి చౌరస్తా వద్ద పోలీసులు పెట్రోలింగ్‌ చేస్తున్న క్రమంలో తాండూరు నుంచి ప్రయాణిస్తున్న ఓ కలప లారీ వెళ్తోంది. అనుమానంతో తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్‌ అల్లాబక్షాపై కేసు నమోదు చేసి లారీని స్టేషన్‌ను తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రికార్డు అసిస్టెంట్‌కు పాము కాటు



చికిత్స పొందుతున్న నరేందర్‌

తాండూరు రూరల్‌: రికార్డు అసిస్టెంట్‌ను కట్లపాము కాటేసింది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జినుగుర్తి గ్రామానికి చెందిన పిట్ల నరేందర్‌ తాండూరు తహసీల్దార్‌ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని గదికి తాళం వేస్తుండగా.. కాలుకు పాము కాటేసింది. దీంతో ఆయన అరుపులు విన్న సహోద్యోగులు పామును చంపి.. ఆయన్ను తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు.

షెల్టర్‌ ఇవ్వలేదనే హత్య

- నలుగురు నిందితులకు రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చేవెళ్ల: ఆలూరులోని విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ ఆపరేటర్‌ హర్యానాయక్‌ హత్యకేసును చేవెళ్ల పోలీసులు ఒక్క రోజులోనే ఛేదించారు. హత్యకు పాల్పడిన నలుగురిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్‌ వెల్లడించారు. ఆలూరుకు చెందిన శ్రీనివాస్‌ గ్రామంలో ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్‌ నిర్వహిస్తున్నాడు. నేపాల్‌కు చెందిన సాగర్‌ మన్సింగ్‌సోదారి మాస్టార్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న నేపాల్‌, మహారాష్ట్ర వాసులైన సాగర్‌ స్నేహితులు.. బినోద్‌థప్ప, రమేశ్‌ధమి, ఉమేశ్‌ భగవన్‌జీ బండారి ఈనెల 21న సాగర్‌ వద్దకు వచ్చారు. రాత్రి పడుకునేందుకు షెల్టర్‌ కావాలని యాజమాని శ్రీనివాస్‌ను అడిగారు. దీంతో గ్రామ సమీపంలోని సబ్‌ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్‌ హర్యానాయక్‌తో మాట్లాడి అక్కడ పడుకోమని సూచించాడు. దీంతో నలుగురు మిత్రులు సబ్‌స్టేషన్‌ వద్ద నిద్రించారు. 22న సైతం సాగర్‌ ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌లో పని చేశారు. ఓనర్‌ శ్రీనివాస్‌ లేకపోవటంతో షాప్‌ బంద్‌ చేసిన అనంతరం అంతా కలిసి మద్యం, కల్లు తాగారు. అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం తాగి మత్తులో ఉన్న వీరు పడుకునేందుకు సబ్‌ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ రోజు కూడా ఇక్కడే పడుకుంటామని హర్యానాయక్‌కు చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న వారిని చూసి వద్దని వారించాడు. దీంతో వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని ఫోన్‌లో శ్రీనివాస్‌కు చెప్పాడు. నేపాల్‌ వ్యక్తులు వచ్చి తనతో గొడవ పడుతున్నారని వెంటనే రావాలని కోరాడు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు కర్రలు, రాళ్లతో హర్యానాయక్‌పై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. అనంతరం అతని సెల్‌ఫోన్‌తో పాటు ఆఫీస్‌లోని ఫోన్‌ తీసుకుని పారిపోయారు. కొద్ది సేపటి తర్వాత సబ్‌ స్టేషన్‌కు చేరుకున్న శ్రీనివాస్‌ హత్యకు గురైనట్లు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్‌ ఇచ్చిన సమాచారం మేరకు లొకేషన్‌ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్‌ డీసీపీ శ్రీనివాస్‌, చేవెళ్ల ఏసీపీ కిషన్‌ పర్యవేక్షణలో చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్‌ కేసును ఛేదించారు. చేవెళ్లకు వచ్చిన సైబరాబాద్‌ సీపీ అవినాశ్‌ మహంతి సీఐ లక్ష్మారెడ్డి ఆయన టీమ్‌ను అభినందించారు.

రుణం పేరిట దగా

- రూ.50 లక్షలు కాజేసిన ముఠా
- పోలీసుల అదుపులో ఇద్దరు
- రూ.46 లక్షలు స్వాధీనం
- పరారీలో మరో ఇద్దరు



పోలీసుల అదుపులో నిందితులు

మీర్‌పేట: రూ.5 కోట్ల రుణం ఇప్పిస్తామని పిలిపించి బెదిరించి రూ.50 లక్షలు కాజేసిన ముఠాలోని ఇద్దరిని మీర్‌పేట పోలీసులు శనివారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర రత్నగిరి జిల్లా అహ్మద్‌నగర్‌కు చెందిన వ్యాపారి బన్సీలాల్‌శర్మ (53) అదే ప్రాంతానికి చెందిన జమీర్‌ నిజాం ఖలీఫ్‌కు చెందిన రాజాపూర్‌ తాలూకాలోని 15 ఎకరాల వ్యవసాయ భూమిని రూ.5 కోట్లకు కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు గాను రుణం కోసం నగరంలోని ఎల్‌బీనగర్‌ మన్సూరాబాద్‌ ప్రెస్‌కాలనీలో నివసించే ఫైనాన్షియర్‌ వజ్రగిరి దుర్గప్ప అలియాస్‌ సురేందర్‌రెడ్డి (29)ని ఏడాది క్రితం పుణేలోని ఓ హోటల్‌లో కలువగా రుణం ఇప్పించేందుకు అంగీకరించాడు. దీనికి 6 శాతం పర్సంటేజీ ఇవ్వడంతో పాటు రూ.5 కోట్ల రుణాన్ని బదిలీ చేసేందుకు గాను ముందుగా రూ.50 లక్షల సెక్యూరిటీ డిపాజిట్‌ చేయాలని అడిగాడు. అనంతరం దుర్గప్పతో పాటు అతని అనుచరులు విజయ్‌, వెంకటేశ్‌, మహేశ్‌తో కలిసి వెరిఫికేషన్‌ నిమిత్తం బన్సీలాల్‌శర్మ ఇంటికి వెళ్లి పాన్‌, ఆధార్‌కార్డులు, ఫొటోలు సేకరించి బ్యాంకు రుణం కోసం అవసరమైన పత్రాలు తీసుకున్నారు. ఆ తరువాత షరతు ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్‌ రూ.50 లక్షలు అడిగారు. ఫిబ్రవరి 18న బన్సీలాల్‌శర్మ భూ యజమాని అయిన జమీర్‌నిజాం ఖలీఫ్‌ నుంచి చేతి బదులుగా రూ.25 లక్షలు తీసుకుని రూ.5 కోట్లతో కలిపి తీసుకున్న డబ్బును మొత్తం తిరిగిస్తానని హామీ ఇచ్చాడు. 19న దుర్గప్ప డబ్బుల కోసం బన్సీలాల్‌శర్మతోపాటు భూ యజమాని జమీర్‌ నిజాం ఖలీఫ్‌ అతని కుటుంబ సభ్యులను జిల్లెలగూడలోని స్వాగత్‌ గ్రాండ్‌ హోటల్‌కు పిలిపించాడు. వారు వచ్చాక దుర్గప్ప అతని సహచరులు విజయ్‌, వెంకటేశ్‌, మహేశ్‌ వారిని బెదిరించి వారి వద్ద ఉన్న రూ.50 లక్షలు లాక్కుని పారిపోయారు. అనంతరం సెల్‌ఫోన్లు స్విచ్చాఫ్‌ చేశారు. బాధితుడు బన్సీలాల్‌శర్మ మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రుణం పేరిట మోసానికి పాల్పడిన ముఠాలోని ఏ1 దుర్గప్ప, ఏ2 విజయ్‌ను శనివారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.46 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్‌ స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.